# సురాజ్య ఉద్యమం

## మౌలిక లక్ష్యాలు

## ఉద్యమ రూపాలు

డా॥ జయప్రకాష్ నారాయణ్

డి.వి.వి.ఎస్. వర్మ

గరిమెళ్ళ నారాయణ

లోక్‌సత్తా పార్టీ

# పునస్సమీక్షకు సమయం

ఏ సమాజంలో అయితే నీతి తప్పిన వారు విజయం సాధిస్తారో,

ఎక్కడయితే నేరస్తులు ఆరాధ్యులుగా మారుతారో,

ఎక్కడయితే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో,

ఎక్కడయితే అసమర్థపాలన, ప్రజల ఉదాసీనత కొనసాగుతుందో,

ఎక్కడయితే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా,

తమకు కావల్సిన వాటాకోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో

అక్కడ

"వ్యవస్థకు సంబంధించిన పునస్సమీక్షకు

సమయం ఆసన్నమైందని అర్థం"

అప్పుడు

తమ గురించి-తమకు సంబంధించిన వారి గురించి

తమ చుట్టూరా వున్నవారి గురించి- తమ కార్యకలాపాలకు సంబంధించి

అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి.

- క్లిట్‌గార్డ్

ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త


**సురాజ్య ఉద్యమం**

ప్రతులు : 2,000

ప్రచురణ సం॥ : మార్చి, 2008

వెల: రూ॥ **5/-**



ఇ.నం. 5-10-180/ఎ&ఎ1, బాండ్‌లేన్స్,

హిల్‌పోర్టు రోడ్, హైదరాబాద్ - 500 004.

ఫోన్ : 91-40-2323 1818/2829,

ఫ్యాక్స్: 2323 0111

# సురాజ్య ఉద్యమం

## - కొన్ని మౌలిక లక్ష్యాలు

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

"స్వరాజ్యం నాజన్మహక్కు" అని లోకమాన్య తిలక్ శతాబ్దం క్రితం నినదించి ప్రజలని ఉత్తేజితుల్ని చేశారు. తెల్లదొరల పాలన భారతీయుల ఆత్మగౌరవానికి కళంకంగా ఆనాటి నేతలంతా భావించి రాజీలేని పోరాటం చేశారు. లక్షలాది స్వతంత్రయోధుల త్యాగఫలంగా స్వరాజ్యన్ని సాధించుకోగలిగాం. మన జాతి నిర్మాతల పుణ్యమా అని ఉదాత్తమైన మానవ విలువలకి ప్రతీకగా, స్వేచ్ఛకి, పౌరసార్వ భౌమత్వానికి సంకేతంగా మనం గర్వించే రాజ్యాంగాన్ని పొందాం. స్వతంత్ర్యం వచ్చాక 1952 నుంచి ఇప్పటిదాకా ఎన్నికలు జరుపుకుంటున్నాం; ప్రభుత్వాలని మార్చుకుంటున్నాం; స్వేచ్ఛని అనుభవిస్తున్నాం; కొంత మేరకి అభివృద్ధిని సాధించుకుంటున్నాం.

కాని నాయకులు మారినా, ప్రభుత్వాలు కుప్పకూలినా పాలనపేరుతో దోపిడి పెరిగిపోతున్నది. మన జాతీయ పోరాటనేతలు స్వరాజ్యన్ని గూర్చి ఎన్నో కలలు కన్నారు. కాని కాలక్రమేణా మన స్వరాజ్యం కొంత మంది 'స్వాహారాజ్యం' గా మారిపోయింది. కేవలం తెల్లదొరలని సాగనంపి, తరచు ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చగానే స్వరాజ్యం వచ్చిందనుకుంటే అది భ్రమే. ఈరోజు దేశమంతటా అధికారాన్ని, రాజకీయాన్ని, పాలనని చూస్తే మూడు రీతులు స్పష్టంగా కానవస్తున్నాయి.

**మొదటిది:** రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి, పాలనలో అంతులేని దోపిడీకి పాల్పడుతున్నారు. పార్టీలు కొందరి వ్యక్తుల, కుటుంబాల స్వంత ఆస్తులుగా మారిపోయాయి. సభ్యులు కేవలం పల్లకీలు మోసే బోయీలుగా, జెండాలు పట్టే కూలీలుగా, అధికారంలో ఉన్న వాళ్ళకి లొంగి ఉండే బానిసలుగా మారిపోయారు. పార్టీలలో పదవులు కేవలం అధినాయకుల అండ ఉన్న కొంతమందికి స్వంతం; నాయకత్వం కుటుంబ వారసత్వంగా సంక్రమించే హక్కు; అక్రమార్జన ద్వారా సేకరించిన డబ్బులో కొంత భాగం ఎన్నికలలో పెట్టుబడిగా పెట్టటం, బలవంతంగానో, ప్రలోభాలతోనో డబ్బులు సేకరించి ఖర్చుపెట్టటమే నిధుల వినియోగం. ఇక పార్టీ తరపున పోటీ చేసేవాళ్ళు కేవలం రాజకీయ వ్యాపారంలో

భాగస్వాములు. ఓటు పొందాలంటే నోట్లతో కొనుక్కోవటం, సారాయి మత్తులో ముంచి లొంగదీసుకోవటం ఈనాటి సంప్రదాయ రాజకీయానికి ఆనవాయితీ అయింది. ఒకసారి పదవుల్లోకి వచ్చేక పెట్టిన పెట్టుబడికి పది, వంద రెట్లు ఆర్జించటమే రాజకీయం లక్ష్యం. ఈ అక్రమార్జన కోసం కాంట్రాక్టులలో కమీషన్లు, లైసెన్సులలో ముడుపులు, బదిలీలకి లంచాలు, పోలీసు కేసుల్లో పైరవీలు, భూముల కబ్జాలు, ప్రాజెక్టులలో వాటాలు, ప్రతిపనికి ఆమ్యామ్యాలు. ఇవన్నీ మన రాజకీయంలో, పాలనలో అంతర్భాగమయ్యాయి. చట్టాన్ని, రాజ్యాంగాన్ని నిలబెట్టవలసిన రాజకీయం వాటిని తుంగలోకి తొక్కుతున్నది. గూండాలు స్వైరవిహారం చేస్తున్నారు; నేరస్తులు నాయకులుగా చెలామణీ అవుతున్నారు. ఇలా అక్రమార్జన, రాజకీయంలో నేరప్రవృత్తి, అవినీతి, దుష్పరిపాలన, అధికార దుర్వినియోగం, అమాయకులకి అడుగడుగునా అన్యాయం ఇవన్నీ విడదీయనంతగా కలిసిపోయాయి. డబ్బు పంపిణీ, మద్యం సరఫరా లేకుండా, అక్రమార్జన లేకుండా, అసలు రాజకీయం సాధ్యమే కాదనే పరిస్థితిని ఈనాటి సంప్రదాయ పార్టీలు కావాలని సృష్టించాయి. స్వరాజ్యాన్ని స్వాహారాజ్యంగా మార్చాయి. గొర్రెలని తినేవాడు పోతే బర్రెలు తినేవాడు వస్తాడనే చందాన రాజకీయాన్ని తయారు చేశాయి.

**రెండవది:** ఒకవేళ ప్రజలంతా తాము కోల్పోతున్నదేమిటో తెలుసుకుని, డబ్బుకి, మద్యానికి లోబడకుండా ఓటేస్తారేమో. ఈ భయంతో సంప్రదాయ రాజకీయం సమాజాన్ని కులం, మతం, భాష ప్రాంతం పేరుతో చీల్చటం, విభజించి పాలించడం నేర్చుకున్నది. జాతీయతని, పౌరసత్వాన్ని విస్మరించి ప్రజల మధ్య ద్వేషాన్ని, అసూయని రగల్చటం ఈ దివాళాకోరు రాజకీయానికి అవసరం. కులం పేరుతో రెచ్చగొట్టటం, మతం పేరుతో ద్వేషాన్ని నింపటం, ప్రాంతం పేరుతో ప్రజలని విడగొట్టటం ఎన్నో వైవిధ్యాలున్న ప్రాచీన సమాజంలో చాలా సులువు. ఇలాంటి కృత్రిమ అడ్డుగోడల్ని నిర్మించి సమాజాన్ని సంకుచితం చేస్తే, పాలకుల అన్యాయాన్ని ఎదిరించే శక్తి పౌరులకుండదు. ముక్కలయిన సమాజంలో ఎన్నికయిన వాడి అవినీతిని గాని, అధికారి దుర్మార్గాన్ని గాని ప్రశ్నించటం కష్టం. ఏం చేసినా 'మనవాడే గదా' అనే తత్వం ఉన్నప్పుడు దోపిడీకి గురవుతున్న వాళ్ళు మౌనంగా అన్యాయాన్ని భరించాల్సిందే. మన 'స్వరాజ్యం' లో సంప్రదాయ రాజకీయం ప్రజలని ఇలా విభజించి పబ్బం గడుపుకోవటంలో ఆరితేరింది. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలని కాపాడటం, సంకుచితత్వాన్ని తొలగించి అందరినీ సమన్వయం చేయటం సరయిన స్వరాజ్యంలో రాజకీయం చేయవలసిన పని. కాని స్వాహారాజ్యంలో, సంకుచిత రాజకీయం పని ప్రజలలో అనుక్షణం విభేదాలని సృష్టించి పబ్బం గడుపుకోవటం.

**ఇక మూడవది:** రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి ఓట్లని డబ్బుతో, ప్రలోభాలతో,

సారాయితో కొన్న సమాజాన్ని చీల్చి ప్రజలని విభజించినా, ఎప్పుడో ఒకప్పుడు తమ జీవితాలు బాగుపడాలన్న కోర్కె సామాన్యులకి కలిగితే స్వాహారాజ్యం ప్రమాదంలో పడుతుంది. అలాంటి ప్రమాదం లేకుండా ఉండాలంటే ప్రజలని తాత్కలిక తాయిలాలతో తృప్తి పరచాలి. అందుకే తాత్కాలిక రాయితీలతో ఓటర్లని మభ్యపెట్టటం ఈనాటి రాజకీయంలో అనవాయితీ అయ్యింది. బీదరికాన్ని తొలగించి ప్రజలని వారి కాళ్లమీద వారు నిలబడేలా చెయ్యాలంటే మంత్రదండాలు, తాయెత్తులతో ఫలితాలు రావు. అందరికీ మంచి ప్రమాణాల విద్య, ప్రతి కుటుంబానికి మంచి ఆరోగ్యం, ప్రతి పౌరుడికి సంపదని సృష్టించే నైపుణ్యం, వ్యవసాయం, ఇతర సంప్రదాయ వృత్తులలో ఆదాయాన్ని పెంచే ఏర్పాట్లు – ఈ నాలుగే బీదరికాన్ని అంతం చేసి అందరికీ న్యాయం అందించే మార్గాలు. కాని ఇవి జరిగితే ఈ దోపిడీ రాజకీయాన్ని, అవినీతి పాలనని స్వాహారాజ్యాన్ని కొనసాగించడం అసాధ్యం. అందుకే నేటి పాలనలో అడపాదడపా తాత్కాలిక రాయితీల ప్రకటన జరుగుతుంది. ప్రతి రూపాయిలో ముప్పావలాని దోచుకోవటం, వనరులని వృథా చేయటం, మిగిలిన కొద్ది మొత్తంతో ప్రజలకి ప్రత్యేకంగా రాయితీలిస్తున్నట్టు నటించి ఓట్లు రాల్చుకోవడం స్వాహారాజ్యంలో తరచు కనిపించే ప్రక్రియలు. ఉచితంగా కలర్ టివీలు, రుణాల మాఫీలు, తాళిబొట్లు, హాజ్‌యాత్రలు, మానస సరోవర్ సబ్సిడీలు, ఇంకెన్నో రాయితీలు – ఇలా ప్రజాధనంతో పౌరులని యాచకులుగా మార్చటం రాజకీయ చతురతగా మారిపోయింది. పౌరుల శక్తి సామర్థ్యాలు వికసించటం కోసం తప్ప, ప్రజలు తమ కాళ్ళ మీద తాము నిలబడడం కోసం తప్ప మరే పనికైనా పన్నుల డబ్బుని ఖర్చు చేసి బీదరికాన్ని కొనసాగించటానికి నేటి పార్టీలు, ప్రభుత్వాలు విపరీతంగా పోటీ పడుతున్నాయి. ప్రజలెంత అమాయకులుగా, అసహాయులుగా ఉంటే పాలకులకి అంత ఆనందం. అప్పుడే స్వాహారాజ్యం యథేచ్ఛగా కొనసాగుతుంది.

మన స్వతంత్రయోధులు దశాబ్దాల పర్యంతం పోరాడి సాధించిన స్వరాజ్యం ఇలా స్వాహారాజ్యంగా మారిన నేపథ్యంలో లోక్‌సత్తా ఉద్యమం తొలి నుంచి ఈ స్వాహారాజ్యం అంతం కావాలని పోరాడుతోంది. రాజ్యాంగ ఫలాలు పొందటం మనందరి జన్మహక్కు. పరాయి వాళ్ళ పాలన పోయి కేవలం వాక్స్వాతంత్ర్యం, ఓటుహక్కు, ఆటగాళ్ళ మార్పు ఉంటే చాలదు. ఆట నియమాలు మారి అందరికీ రాజ్యంగ ఫలాలందించటం కోసం లోక్‌సత్తా 'సురాజ్య' ఉద్యమాన్ని ప్రతిపాదిస్తోంది.

**"సురాజ్యం అంటే ఏమిటీ?** స్వాహారాజ్యాన్ని సురాజ్యంగా మార్చాలంటే ఏం జరగాలి? సురాజ్యానికి నిర్దిష్టమయిన లక్ష్యాలని ప్రతిపాదించినప్పుడే మరోసారి ప్రజలు మోసపోకుండా కాపాడుకోగలం; ఆశించిన ఫలితాలని పొందగలం. లోక్‌సత్తా ఐదు ప్రాథమిక లక్ష్యాలని

ప్రతిపాదిస్తూ సురాజ్య ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నది.

**1. కొత్త రాజకీయ సంస్కృతి** ఈనాటి వ్యాపార, పెత్తందారీ రాజకీయ సంస్కృతిని అంతం చేసి ప్రజాస్వామ్య రాజకీయాన్ని ప్రతిష్ఠించాలి.

- కొందరి స్వంత ఆస్తులుగా, ఆధునిక జమీందారీలుగా, కుటుంబ వారసత్వంగా మారిన పార్టీలని ప్రజాస్వామీకరించి సభ్యులు సంస్థలుగా, సమాజం సంపదగా నిలబెట్టాలి. వనరుల సమీకరణ, వినియోగం పారదర్శకంగా ధర్మబద్ధంగా, చట్టం పరిధిలో ఉండాలి.
- గూండాలని, నేరస్తులని, అక్రమార్జనపరులని, నాయకుల సంతానాన్ని ప్రజల నెత్తిన రుద్దే దారుణ సంస్కృతికి స్వస్తి చెప్పి సమాజంలో అత్యుత్తములని, నిజాయితీపరులని, సమర్థులు, అన్ని వర్గాల ప్రయోజనాలని కాపాడే వారిని ప్రజాజీవనంలోకి తేవాలి.
- ఎన్నికలలో ఓట్ల కొనుగోలు, సారా పంపిణీ, బలప్రయోగం, దొంగఓట్లు అంతం కావాలి.
- సమాజాన్ని చీల్చే దుష్టసంస్కృతిస్థానే ఒకే జాతి, ఒకే పౌరసత్వం రాజకీయానికి ఆలంబన కావాలి.

**2. అవినీతి అంతం :** విశృంఖలంగా అడుగడుగునా రాజ్యమేలుతున్న అవినీతిని అంతం చేసి, స్వాహారాజ్యం స్థానంలో సురాజ్యాన్ని స్థాపించాలి.

- అవినీతిపరుల ఆస్తులని ప్రజల పరం చేసేందుకు చట్టాన్ని తెచ్చి, అక్రమార్జనతో పాటు ఇతర ఆస్తుల కుటుంబానికి అందకుండా చెయ్యాలి.
- అవినీతిపరుల ఆట కట్టించటానికి స్వతంత్ర ప్రతిపత్తితో, సర్వాధికారాలు, సిబ్బందితో, పక్షపాతాలకతీతంగా ఉండే సంస్థని జాతీయ, రాష్ట్ర, జిల్లా, నగరస్థాయిలలో ఏర్పాటు చేయాలి.
- ప్రతి జిల్లాకి ప్రత్యేక కోర్టులని ఏర్పాటు చేసి అవినీతిపరులకి సత్వరం జైలు శిక్ష పడేలా చూడాలి.
- ప్రజలని అవినీతిపై పోరాటంలో భాగస్వాములని చెయ్యటం కోసం, కొనుగోళ్ళలో, కాంట్రాక్టులలో, పథకాల అమలులో ప్రజల నిఘా, అజమాయిషీ ఉండడం కోసం తగిన చట్టాలని చేసి, వాటి సత్వర అమలుకి సంస్థాగత ఏర్పాట్లు చెయ్యాలి.

**3. అందరికీ ఎదిగే అవకాశాలు :** ఆధునికయుగంలో పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకి విద్య, ఆరోగ్యాన్ని అందించటమే రాజకీయానికి, రాజ్యవ్యవస్థకి నైతిక పునాది. అందరికి ఎదిగే

అవకాశాలివ్వని వ్యవస్థ ప్రజలని కేవలం ఓటు బ్యాంకులుగా, చేయిచాచి అర్థించే యాచకులుగా మారుస్తుంది. సురాజ్యంలో అందరి శక్తిని వికసింపజేయటం, నివారించదగ్గ బాధలని నిర్మూలించటం, ఆర్థికవ్యవస్థలో పాలుపంచుకునే నైపుణ్యాన్నివ్వటం మౌలిక లక్ష్యాలు కావాలి.

- ప్రతి బిడ్డకి పన్నెండేళ్ళ పాటు మంచి ప్రమాణాల విద్య అందించటం కోసం సర్వశక్తుల్ని కేంద్రీకరించి ప్రతి పౌరుడి శక్తి సామర్థ్యాలని వెలికితీయాలి.
- ప్రతి కుటుంబానికి పూర్తి ఆరోగ్య భద్రతని కల్పించి ఏ వ్యాధికైనా స్వంత ఖర్చు లేకుండా నచ్చిన ఆసుపత్రిలో చికిత్స అందే ఏర్పాటు చెయ్యాలి.
- ప్రతి పౌరుడికి నైపుణ్యాన్ని పెంచి సంపద సృష్టిలో పాలుపంచుకునే అవకాశాన్ని కల్పించాలి.

**4. అందరికీ ఒకే న్యాయం :** మనది పేరుకు స్వరాజ్యమయినా వాస్తవానికి చట్టం ఉన్నవాడికి చుట్టమయింది. ఉన్నవాడికో న్యాయం, లేని వాడికో న్యాయం సర్వత్రా అమలవుతోంది. బడితే ఉన్నవాడిదే బర్రెకావటంతో నేరస్తులకి గిరాకీ పెరిగింది. అందరికీ సమాన న్యాయం అందించటం, ప్రతిపౌరుడూ తలెత్తుకుని హుందాగా తిరిగే పరిస్థితిని కల్పించటం సురాజ్యానికి ప్రాతిపదిక కావాలి.

- పోలీసు యంత్రాంగానికి స్వయం ప్రతిపత్తినిచ్చి, నేర పరిశోధనని నిష్పాక్షికంగా, సమర్థంగా జవాబుదారి తనంతో చేపట్టే విధంగా ఏర్పాట్లు చేసి సామాన్యులకి రక్షణ కల్పించాలి; చట్టాన్ని ఉల్లంఘించే వాళ్ళు ఎంత బలవంతులయినా వారిని శిక్షంచ గలగాలి. పౌరుడు నిర్భయంగా పోలీసు అండని కోరే స్థితిని, కోటీశ్వరుడయినా, అధికారంలో ఉన్నవాడయినా చట్టాన్ని ఉల్లంఘించటానికి భయపడే వాతావరణాన్ని సృష్టించాలి.
- న్యాయవ్యవస్థని ప్రజలకి అందుబాటులోకి తెచ్చి, సకాలంలో సమర్థన్యాయం అందరికీ సులభంగా అందే మార్పులు తేవాలి.

**5. ఇంటి ముంగిట ప్రభుత్వం, కంటి ముందు పాలన :** పేరుకి స్వపరిపాలన అయినా పాలన ప్రజలకి దూరంగా ఉంటే ఫలితాలు రావు. అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించటం, పౌరుణ్ణి పాలనకి కేంద్రబిందువుని చేయటం, ప్రజలకి వీలయినంత చేరువగా బాధ్యతలని నిర్వహించే ఏర్పాట్లు చెయ్యటం, పౌరుడు నిరంతరం నిలదీసే అవకాశాన్ని కల్పించటం, జవాబుదారీతనం కోసం ఏర్పాట్లు చెయ్యటం, సురాజ్య నిర్మాణంలో కీలకమయినవి. స్థానిక

ప్రభుత్వాల సాధికారత, పౌరుల సార్వభౌమత్వం సురాజ్యానికి పునాదులు.

- జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు
- నగరాలు, పట్టణాలు, గ్రామాల స్వయంపాలన
- వనరులు, బాధ్యతలు స్థానికంగా ప్రజల చేతుల్లో వుంచటం
- కీలకమైన సేవలని పౌరబృందాలే నిర్వహించుకోవటం
- పోలీసు, న్యాయవ్యవస్థలలో వికేంద్రీకరణ
- పాలనా సమాచార హక్కు పూర్తి అమలు
- సకాలంలో సేవల కోసం విధిగా అమలయ్యే పౌరసేవాపత్రాలు
- స్థానికంగా అవినీతిని అంతం చేసేందుకు సంస్థాగత ఏర్పాట్లు

మన రాజ్యాంగ నిర్మాతలు, స్వతంత్రయోధులు ఆశించిన లక్ష్యాలు సాధించటమే సురాజ్యపోరాట లక్ష్యం. ప్రతి పౌరుడు సార్వభౌముడయ్యే నిజమయిన ప్రజారాజ్యాన్ని సాధించటమే మన కర్తవ్యం. ఈ సురాజ్య ఉద్యమం జాతి మొత్తానికి వర్తించేది. ఇది రెండవ స్వతంత్రపోరాటం.

# సురాజ్యం కోసం ప్రజా ఉద్యమం

**డి.వి.వి.ఎస్.వర్మ**

స్వరాజ్య ఉద్యమం మన ఆదర్శం, దేశంకోసం నాటి నేతలు త్యాగాలు చేశారు. స్వరాజ్యం వచ్చినా దాని ఫలితాలు పూర్తిగా ప్రజలకు దక్కడం లేదు. మన రాజకీయం దానిని స్వాహారాజ్యం చేసింది. ఇది పాలకుల దుర్మార్గం. దేశాన్ని దోచుకోవడే రాజకీయం అయ్యింది. ఈ అవినీతి పాలనను అంతం చెయ్యాలి. అభివృద్ధిని అందరి సొంతం చెయ్యాలి. సురాజ్య స్థాపనకు సమరశంఖం పూరించాలి. సుపరిపాలనకు మరో స్వతంత్ర పోరాటాన్ని సాగించాలి. స్వరాజ్య ఉద్యమానికి అహింస ఆయుధం. సురాజ్య ఉద్యమానికి ఓటే ఆయుధం అది ప్రజల చేతుల్లో ఉంది. పరాయిపాలన అంతానికి చేసిన త్యాగాలు ఇప్పుడు అవసరం లేదు. ఎందుకంటే మార్పు పూర్తిగా ప్రజల చేతుల్లో ఉంది. వారి ఓటులోనే ఉంది. అందుచేత సురాజ్య ఉద్యమం ప్రజల ఉద్యమం కావాలి. సురాజ్యం ప్రజల నినాదం అయితే మార్పు వచ్చి తీరుతుంది. ప్రజలలో అలాంటి చైతన్యాన్ని రగిలించే ప్రజాఉద్యమాన్ని మనం రూపొందించుకోవాలి. అదే సురాజ్య ఉద్యమం.

ధనరాజకీయం మన సమాజాన్ని పూర్తిగా నిస్సహాయ స్థితికి నెట్టివేసింది. నిరాశతో నింపివేసింది. అత్యధిక సంఖ్యాకులు మార్పుకోరుకుంటున్నా, మార్పు సాధ్యమేనా అన్న శంక వెంటాడుతోంది. ఎన్నికల్లో ధనబలాన్ని, కండబలాన్ని,మద్యం మత్తునీ ఓడించగలమా అన్న అనుమానం పట్టిపీడుస్తున్నది. ప్రజలు ఎన్నికల్లో ఆటగాళ్ళని మార్చినా ఆటనియమాలు మారకపోవడం చేత ఏరాయి అయితేనేం పళ్ళు ఊడగొట్టుకోవడానికి అన్నట్టుగా ఎవరువచ్చినా జరిగేది ఇదేతంతు అన్న సంశయంలో ఉన్నారు.

సురాజ్య ఉద్యమం ప్రజల్లో వారిశక్తి పట్ల విశ్వాసాన్ని కలిగించాలి. నైరాస్యాన్ని తొలగించి భవిష్యత్తు పట్ల కొత్త ఆశల్ని చిగురింప చేయాలి. ఈ మార్పు సాధ్యమేనని, అది వారి చేతుల్లోనే ఉందన్న అంశాన్ని స్పష్టపర్చాలి. అందుకు తగిన కార్యకలాపాలను సురాజ్య ఉద్యమం రూపొందించుకోవాలి.

ప్రస్తుత రాజకీయం అంటే దగా, మోసం అన్న భావనను తొలగించడానికి కొత్తరాజకీయ సంస్కృతిని ప్రజల ముందు ఆవిష్కరించాలి. రాజకీయం ప్రజలకు తప్పనిసరి అవసరం అన్న గుర్తింపునీ, సమాజహితం కోసం, ఉమ్మడి అవసరాలు తీర్చడం కోసం

సాగించే పవిత్ర వ్యాసంగం అన్న భావనను బలంగా పాదుకొల్పాలి.

జాతీయోద్యమ స్ఫూర్తితో దీనికి అంకురార్పణ చెయ్యాలి. చిత్తశుద్ధితో ప్రజల విశ్వాసాన్ని చూరగొనే ప్రత్యక్ష దూతల్ని మనం సృష్టించుకోవాలి. మార్పువస్తుందన్న నమ్మకం నశించిన వారిలో కొత్త ఆశల్ని, కొత్త విశ్వాసాన్ని కల్పించే విధంగా సురాజ్య ఉద్యమ కార్యక్రమాలను మనం రూపొందించుకోవాలి.

**1) సమాజహితం కోసం నిలబడే సురాజ్య వలంటీర్లు :** సురాజ్య వలంటీర్ల పేరుతో సమాజహితం కోసం పాటుపడే కార్యకర్తలు ఈ ఉద్యమానికి ఆధారంగా ఉంటారు. ఈ వలంటీర్లు స్వంత లాభం కొంత మానుకుని సమాజహితానికి తోడ్పడేవారై ఉంటారు. ఏదో ఒక ప్రజాహిత కార్యక్రమంలో చురుకైన పాత్ర వహించేవారై ఉంటారు. సమాజహితం కోసం కృషి చేసే వారు ఇంకా ఉన్నారని, రాజకీయం సమాజహితానికి దోహదం చేస్తుందన్న నమ్మకాన్ని ప్రజలకు కల్పించడానికి ప్రత్యక్ష సాక్షులుగా వారు వ్యవహరిస్తారు. ఇలాంటి విశ్వాసాన్ని కలిగించలేకపోతే ఇలాంటి వలంటీర్ల బృందాలను మనం రూపొందించుకోలేకపోతే సురాజ్య ఉద్యమం ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేదు.

అందుచేత ముందుగా సమాజహితం కోసం ఏదో ఒక నిర్మాణ కార్యక్రమం పట్ల ఆసక్తిగల వారిని, రాజకీయాన్ని సమాజహితం కోసం చేసే పవిత్ర కార్యక్రమంగా విశ్వసించే వారిని సురాజ్య వలంటీర్లుగా నమోదు చేసుకోవడంతో ఈ ఉద్యమం ప్రారంభం కావాలి.

లోక్‌సత్తా పార్టీ ఈ సురాజ్య ఉద్యమాన్ని నిర్వహిస్తున్నప్పటికీ సురాజ్య వలంటీర్లుగా నమోదయ్యే వలంటీర్లు మాత్రం విధిగా పార్టీ సభ్యులు అయి తీరాల్సిన అవసరం లేదు. కాని సురాజ్య వలంటీర్లు విధిగా సమాజహితం కోసం చేసే నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొనే ఆసక్తిగల వారుగా మాత్రం ఉండితీరాలి

- వ్యక్తిగతంగా సమాజహితం కోసం ఏదో ఒక నిర్మాణ కార్యక్రమం నిర్వహించే వారై ఉండాలి
- నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించే బృందంలోనైనా సభ్యునిగా పనిచేయడానికి సంసిద్ధులై ఉండాలి
- ఒక వలంటీర్ల బృందాన్ని తానే రూపొందించి నిర్మాణ కార్యక్రమాలకు సారధ్యం వహించే వారుగానైనా ఉండాలి
- సురాజ్య ఉద్యమ ప్రచారకులుగా పనిచెయ్యాలన్న ఆసక్తిగల వారై ఉండాలి

- సురాజ్య సాధనకు సాగించే ఉద్యమాలలో కార్యకర్తగా పాలుపంచుకునే వారు
- పౌర సేహాయ కేంద్రాలను నిర్వహించే ఆసక్తిగల వారు
- ప్రతిరోజూ కొన్ని గంటలపాటు లేదా ప్రతి వారంలో ఒక రోజు లేదా సంవత్సరంలో 20, 30 రోజులపాటు స్వచ్ఛందంగా సమాజహితం కోసం నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించే వారై ఉండాలి. ఇలాంటి వారంతా సురాజ్య వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి.

మన సమాజంలో ఉన్న మేధావులు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, వ్యాపార వాణిజ్య వర్గాలు, ఉద్యోగులు, కార్మికులు, యువతీ యువకులు, మహిళలు అందరూ వ్యక్తులుగా, బృందాలుగా సమాజహితం కోసం సాగించడానికి వీలుంటుంది. ఇలా సురాజ్య ఉద్యమం అందరి ఉద్యమంగా, అందరూ వ్యక్తులుగా పాల్గొనే ఉద్యమంగా మనం రూపొందించుకోవాలి.

ఉదాహరణకి ఒక డాక్టరు

- రోజూ లేదా వారంలో ఒక రోజు పేదలకు ఉచిత పరీక్షలు నిర్వహించడం
- ఒక డాక్టర్ల బృందం సభ్యునిగా మెడికల్ క్యాంపులను నిర్వహించడం
- అందరికీ ఆరోగ్యాన్ని అందించడం రాజ్య వ్యవస్థ బాధ్యతగా ప్రచారం చేసే కార్యకలాపాలు నిర్వహించడం
- ఆరోగ్యం పై పేదలకీ, పాఠశాల పిల్లలకి పరిజ్ఞానాన్ని అందించే కార్యక్రమాలు నిర్వహించడం

ఇందులో తనకు నచ్చిన కార్యక్రమాన్ని ఎంచుకోవాలి. సురాజ్య ఉద్యమంలో వలంటీరుగా పాలుపంచుకోవచ్చును.

ఇలాగే వివిధ సామాజిక వృత్తులలో ఉన్న వారు, విద్యార్థులు, మహిళలు, యువతకి నిర్దిష్టంగా వ్యక్తిగతంగా పాల్గొనే కార్యక్రమాలు, బృందంగా చేయదగు కార్యక్రమాలను రూపొందించుకోవచ్చును

**2) సురాజ్య వలంటీర్ల శిక్షణ :** సురాజ్య వలంటీర్లుగా నమోదు అయిన వారికి ఈ ఉద్యమం మీద అవగాహన పెంపొందించుకోవడానికి లోక్‌సత్తా పార్టీ శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేస్తుంది

**3) ప్రజల దగ్గరకు సురాజ్యం – ప్రచార యాత్రలు**

ప్రజల దగ్గరకు సురాజ్య ఉద్యమాన్ని తీసుకెళ్ళాలి. ప్రజల్ని ప్రభావితుల్ని చేసే ప్రచార కార్యక్రమాలను చేపట్టాలి. ప్రజలు ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి, తమ ఉద్యమంగా స్వంతం చేసుకోవడానికి తగిన విధంగా కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించాలి.

- రాష్ట్రస్థాయిలో ప్రచార యాత్రలు – సభలు, సమావేశాలు, కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రచారాన్ని సాగించడం
- జిల్లాలో పట్టణాలు, గ్రామాల స్థాయిలో స్థానిక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి
- వివిధ తరగతుల ప్రజలలో – విద్యార్థులు, మహిళలు, కళాకారులు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు ఈ ఉద్యమ వ్యాప్తికి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలి
- వ్యక్తులుగా, బృందాలుగా సురాజ్య వలంటీర్లు చేపట్టే కార్యక్రమాలను రూపొందించుకోవాలి

4) సురాజ్య ఉద్యమ సాహిత్యం – సాంస్కృతిక కళారూపాలు : సురాజ్య ఉద్యమ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చెయ్యడానికి తగిన సాహిత్యాన్ని ప్రచురించాలి. ఎగ్జిబిషన్‌లను రూపొందించాలి. పాటలు, నాటికలు తదితర సాహిత్య కళారూపాలను పెంపొందించాలి. కళా బృందాలను ప్రోత్సహించాలి.

**5) ప్రజా ఉద్యమాలు :** సురాజ్య ఉద్యమ లక్ష్యాలకి అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి తగిన ఉద్యమాలను నిర్వహించాలి. సురాజ్య స్థాపన కోసం అవినీతి పాలన అంతం చెయ్యడం అన్నది ప్రజా ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఉండాలి. అవినీతిపాలన అంతం అభివృద్ధి అందరి సొంతం అన్నది ప్రజా ఉద్యమాల నినాదం కావాలి

- రాష్ట్రస్థాయిలో రాజకీయ అవినీతికి మూలమైన అంశాలపై నిర్థిష్టమైన కార్యాచరణ గల కార్యక్రమాన్ని రూపొందించాలి
- పట్టణ, గ్రామస్థాయిలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనడానికి వీలైన కార్యక్రమాలను రూపొందించాలి. ఏదో ఒక నిర్థిష్టమైన అంశం మీద ప్రజల్ని అవినీతి వ్యతిరేక ఉద్యమంలో ప్రత్యక్షంగా భాగస్వాములను చెయ్యాలి.
- వివిధ తరగతుల ప్రజలను సురాజ్య ఉద్యమంలో భాగస్వాములను చేసే కార్యక్రమాలను రూపొందించాలి

రాజధాని నుండి పల్లె వరకూ, పిల్లల నుండి మేధావుల వరకు ఈ ఉద్యమంలో పాలుపంచుకునే విధంగా కార్యక్రమాలను రూపొందించాలి. అప్పుడే అది మరో స్వతంత్ర పోరాటరూపాన్ని సంతరించుకుంటుంది.

**6) నిర్మాణ కార్యక్రమాలు :** నిర్మాణ కార్యక్రమాలలో కొన్ని కేవలం సహాయ కార్యక్రమాలుగానే కనిపించినా వాటికీ పాలనతో, సురాజ్య ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం ఉంది. ప్రజలు కట్టే పన్నుల సొమ్ముకీ, పొందుతున్న సేవలకీ మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలు గ్రహించేలా జీవితానికీ, సమాజానికీ, రాజకీయానికీ ఉన్న సంబంధాన్ని అవగాహన చేసుకునేలాగా నిర్మాణ కార్యక్రమాలను రూపొందించాలి. పిల్లల చదువు నుండి పారిశుధ్యం వరకూ పంచాయితీ సేవల నుండి పౌరహక్కుల వరకూ సురాజ్య ఉద్యమం చుట్టూ నిర్మాణ కార్యక్రమాలను రూపొందించాలి.

పౌరసహాయ కేంద్రాలు పట్టణాల నుండి పల్లెల వరకు విస్తరింపజెయ్యాలి. అవినీతి పాలన అంతంలో సమాచార హక్కు, సిటిజన్స్ ఛార్టర్లు వంటి ఆయుధాలను వినియోగించడానికి ఇవి వేదికలు కావాలి

**7) వివక్షలేని సమాజం కోసం ఉద్యమం :** ఎలాంటి వివక్షకీ తావులేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించడం సురాజ్య లక్ష్యాలలో అత్యంత కీలకమైంది. ఇదొక రాజకీయ, సామాజిక సమస్య. మన సమాజంలో లింగ వివక్ష, కులవివక్ష, పేదరికం వల్ల వివక్ష మొత్తం మీద పుట్టుకతో వివక్ష కొనసాగుతున్నది. దీనిని అంతం చెయ్యాలి. అందుకోసం సమాజాన్ని, రాజకీయాన్ని సిద్ధం చెయ్యాలి. ఈ తరగతుల వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో సాధికారత కల్పించడం – అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలను కల్పించడం, వివిధ వృత్తులను ఆధునీకరించడం, వారికి జీవన భద్రత కల్పించడం లక్ష్యంగా ఈ ఉద్యమం సాగాలి. ఇందులో అందరికీ సమానంగా మంచి ప్రమాణాల పాఠశాల విద్య, ఆరోగ్యం అందించడం, జనాభాదామాషా ఆధారంగా చట్ట సభలలో ప్రాతినిధ్యం కల్పించడం, ఈ తరగతుల వారికి జీవన భద్రతకు ఏర్పాట్లు చెయ్యడం ఆధారంగా కార్యక్రమాలను రూపొందించాలి. మహిళలను, దళితులు, ఆదివాసీలు, బలహీనవర్గాల ప్రజల్ని, పేదరికంలో ఉన్న అన్ని తరగతుల ప్రజలకీ సామాజిక న్యాయం కల్పించడం లక్ష్యంగా ఉండాలి.

**8) వివిధ కార్యక్రమాలు, ఉద్యమాలు :** మనసమాజంలో ఇంకా బహుముఖమైన మార్పులని మనం సాధించాలి. అందుకోసం తగిన కార్యక్రమాలను రూపొందించుకోవాలి.

– **కఠిన మద్య నియంత్రణ :** పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్న మద్యం,

సారా, గుడుంబాల మీద ఉద్యమాలను తీవ్రతరం చెయ్యాలి. మద్యం ప్రభుత్వాలకి ఆదాయ మార్గం కాకుండా చెయ్యాలి. ఎన్నికల్లో గెలవడానికి మద్యం, సారా పంపిణీ సాధనాలు కాకుండా చెయ్యాలి. కఠిన మద్య నియంత్రణను సాధించాలి

- **చట్టబద్ధ పాలన :** మన పాలనలో చట్టబద్ధత పూర్తిగా లోపించింది. ఉన్నవాడికో న్యాయం లేని వాడికో న్యాయం సాగిపోతున్నది. బడితె ఉన్న వాడిదే బర్రె అన్న ఆటవిక న్యాయం నడిచిపోతున్నది. దీనిని తక్షణం చక్కదిద్దాలి. న్యాయవ్యవస్థలో సంస్కరణలు, పోలీసువ్యవస్థలో సంస్కరణల ద్వారా దీనిని సాధించాలి.

- **గ్రామీణ ఆర్థిక వ్యవస్థ :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం కీలకం. అది పూర్తిగా సంక్షోభంలో పడింది. రైతులు, పేదల జీవనం దుర్భరం అవుతుంది. దీనిని చక్కదిద్దే చర్యలు తక్షణ అవసరంగా ఉన్నాయి.

- **నగరీకరణ సమస్యలు :** రాష్ట్రంలో నగరీకరణ అస్తవ్యస్తంగా ఉంది. కొద్దినగరాల మీదే ఒత్తిడి పెరగడంతో పెద్దనగరాలలో ప్రజాజీవనం – ట్రాఫిక్, కాలుష్యం పేదల వాడల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. అలాగే అందుబాటులో నగరీకరణ లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారింది. వీటిపై దృష్టిసారించాలి.

**9) జిల్లా ప్రభుత్వాలు – స్థానిక స్వరాజ్యాలు :** ప్రజలు నివశించేది సమస్యలు అనుభవించేది ఒక చోట, అధికారం నిధులు మరొకచోట ఉండడం ప్రజల్ని అనవసరపు ఇబ్బందులకు గురిచేస్తున్నది.

- **జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు :** ఇలాంటి ముందు ప్రభుత్వం, కంటి ముందు పాలనను సాధించడం సురాజ్య ఉద్యమానికి ఒకకీలక లక్ష్యం అవుతుంది. దీనికోసం ప్రజల్ని సమీకరించే కార్యకలాపాలు సాగించాలి.

**10) సురాజ్య నిధి :** సురాజ్య ఉద్యమ కార్యక్రమాలలో సురాజ్య నిధి సేకరణ ఒక కీలకమైన అంశం. సురాజ్య ఉద్యమాన్ని ప్రజల ఉద్యమంగా నిర్వహించడానికి వలంటీర్ల శ్రమతోపాటు నిధులు అవసరం. లోక్‌సత్తా పార్టీ సురాజ్య నిధిని నిర్వహిస్తుంది. వలంటీర్లు వ్యక్తిగతంగా విరాళాలు ఇవ్వడంతోపాటు, విరాళాల సేకరణ కూడా ఒక బాధ్యతగా ఉంటుంది. సురాజ్య నిధికి విరాళాలు ఇవ్వడం ఈ ఉద్యమానికి తోడ్పాటునివ్వడమేనని, అన్ని తరగతుల ప్రజలు భావించేలా ప్రోత్సహించాలి.

**11) సురాజ్య ఉద్యమ రూపాలు :** జాతీయోద్యమ విలువలే సురాజ్య ఉద్యమానికి స్ఫూర్తిగా ఉంటాయి. మంచి లక్ష్యాల సాధనకు మంచి మార్గాలే అనుసరణీయం అన్న సూత్రమే

మార్గదర్శకంగా ఉంటుంది. హింసకు తావులేకుండా శాంతియుత పద్ధతులతోనే సురాజ్య ఉద్యమం సాగుతుంది. ఇతరుల స్వేచ్ఛకి భంగం వాటిల్లకుండా నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛని మాత్రమే వినియోగిస్తుంది. అందుచేత బంద్‌లు, రాస్తారోకోల వంటి ఇతరుల స్వేచ్ఛకి భంగం కలిగించే ఉద్యమ రూపాలను చేపట్టదు. సత్యాగ్రహాలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ప్రజాభిప్రాయ సేకరణలు తదితర కార్యక్రమాలతోపాటు ఆధునికమైన, నాగరికమైన నిరసన పద్ధతులను పాటిస్తుంది.

ఇవీ స్థూలంగా సురాజ్య ఉద్యమ స్వరూప స్వభావాలు. ఇది ఒక సంగ్రహ చిత్రం మాత్రమే. ప్రతి అంశం మీద నిర్దిష్టంగా కార్యక్రమాలను రూపొందించుకోవాలి. కార్యాచరణకు ఉపక్రమించాలి. కార్యాచరణలో అనుభవాలను, గుణపాఠాల ఆధారంగా వీటిని పరిపుష్టం చేసుకోవాలి.

స్వరాజ్యం అనంతరం సురాజ్యం దానంతట అదే వస్తుందని చాలామంది ఆశించారు,. కాని అది రానురాను స్వాహారాజ్యంగా మారింది. మనం ఆధునికయుగంలో ఉన్నాం. కాని మన రాజకీయం, ఆటవిక లక్షణాలను పెంపొందించుకుంటున్నది. దీనిని నిరోధించాలి. సురాజ్యానికి బాటలు తీయాలి.

**సురాజ్యం నిన్ననే మనం అనుభవించాల్సింది**

**రేపటి కోసం వేచిచూస్తే ఆలస్యం అవుతుంది**

**ఇప్పుడే అందుకోసం అడుగులు వేద్దాం...**

# సురాజ్య ఉద్యమం - తొలికార్యక్రమాలు

- గరిమెళ్ళ నారాయణ

సురాజ్య ఉద్యమం దేశంలో సుపరిపాలనకు సాగించే మరో స్వతంత్రపోరాటం. స్వరాజ్య ఫలితాలను దేశ ప్రజలు పూర్తిగా అనుభవించడానికి సాగించే ఉద్యమం. ప్రస్తుత రాజకీయం స్వరాజ్యాన్ని స్వాహారాజ్యం చేసింది. ఈ స్వాహారాజ్యాన్ని అంతం చెయ్యడం, ప్రజల్ని ప్రభువుల్ని చేసే ఉత్తమ ప్రజాస్వామ్యాన్ని సాధించడం లక్ష్యంగా ఈ ఉద్యమం సాగుతుంది.

లోక్‌సత్తా పార్టీ ఈ సురాజ్య ఉద్యమాన్ని నిర్వహిస్తుంది. దీనిని విశాల ప్రాతిపదిక మీద నిర్వహిస్తుంది. పార్టీ సభ్యులకే పరిమితం చెయ్యకుండా ఆసక్తిగల పెద్దలకూ, వ్యక్తులకూ, పౌరసంస్థలకూ భాగస్వామ్యాన్ని కల్పిస్తుంది. ఇది దేశంకోసం నిర్వహిస్తున్న ఉద్యమం. ఇది సురాజ్యం కోరే ప్రజల ఉద్యమంగా ఉంటుంది. అందరూ పాలుపంచుకోండి. సురాజ్యం మన అందరి ఉద్చమంగా తీర్చిదిద్దండి.

స్వరాజ్యం కోసం ఉరికంబం ఎక్కిన సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి నాడు సురాజ్య ఉద్యమం లాంఛనంగా ప్రారంభం అవుతుంది.

**1) సురాజ్యం సదస్సు :** 2008 – మార్చి 23, ఉదయం 10 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సురాజ్య సదస్సు జరుగుతుంది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సురాజ్య ఉద్యమంలో ఆసక్తిగల వివిధ రంగాలలోని ప్రముఖులు, పెద్దలు, శ్రేయోభిలాషులతో జరిగే ఈ సమావేశంలో సురాజ్య ఉద్యమ లక్ష్యాలు, కార్యక్రమాలపై చర్చించి, వాటిని ప్రకటిస్తారు.

**2) సురాజ్యం బహిరంగ సభ :** మార్చి 23, సాయంత్రం, 4 గంటలకు, సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభతో సురాజ్య ఉద్యమం లాంఛనంగా ప్రారంభం అవుతుంది.

**3) సురాజ్యం ఎగ్జిబిషన్ :** స్వరాజ్యం – స్వాహారాజ్యం – సురాజ్యాల పై కార్టూన్లు, ఫొటోలు, చిత్రాలతో రూపొందించే ఎగ్జిబిషన్ ప్రారంభం అవుతుంది.

**4) సురాజ్య వలంటీర్ల నమోదు :** మార్చి 23న జరిగే బహిరంగ సభ దగ్గర సురాజ్య వలంటీర్ల నమోదు కార్యక్రమం ప్రారంభం అవుతుంది. రాష్ట్ర వ్యాపితంగా ఏప్రిల్ 6 నుండి వలంటీర్ల నమోదు ప్రారంభం అవుతుంది.

**5) వలంటీర్ల శిక్షణ :** స్వరాజ్యం – స్వాహారాజ్యం – సురాజ్యాలపైన, ఉద్యమ

కార్యకలాపాలపైన, వ్యక్తిగతంగా చేపట్టదగు కార్యక్రమాల మీద అవగాహన కల్పించడానికి వలంటీర్ల శిక్షణా కార్యక్రమాలు ఏప్రిల్ 15 నుండి, హైదరాబాద్‌లోని- ప్రజాస్వామ్య శిక్షణా సంస్థలో ప్రారంభం అవుతాయి.

**6) సురాజ్య ఉద్యమ కార్యకలాపాల రూపకల్పన :** సురాజ్య వలంటీర్లు వివిధ తరగతుల వారీగా, వ్యక్తిగతంగా, బృందాలుగా నిర్వహించే కార్యకలాపాలను నిర్ధిష్టపరచడానికి, రాష్ట్రవ్యాపితంగా అవినీతి పాలనపై సాగించే ఉద్యమాల రూపకల్పనకు, పట్టణాలలో, గ్రామాలలో నిర్వహించే కార్యకలాపాలను రూపొందించడానికి ఏప్రిల్ 13, 14 తేదీల్లో ఆసక్తిగల వ్యక్తులతో ప్రత్యేక బృందాల సమావేశాలు జరిపి వాటికి తుదిరూపం ఇస్తారు.

**7) సురాజ్య ఉద్యమ సాహిత్యం - సాంస్కృతిక కార్యక్రమాలు :** సురాజ్య లక్ష్యాలను వివరించే ఉద్యమ సాహిత్యాన్ని రూపొందిస్తుంది. పాటలు, నాటికలు తదితర కళా సాహిత్యాన్ని రూపొందిస్తుంది. కళాకారులతో సాంస్కృతిక బృందాలను ఏర్పాటు చేస్తుంది.

**8) సురాజ్య ప్రచారయాత్రలు :** రాష్ట్ర వ్యాపితంగా సాగించే సురాజ్య ప్రచారయాత్ర మార్చి 23న, హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభం అవుతుంది. ఈయాత్ర హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో కొనసాగుతుంది. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతితో ఈ ప్రచారయాత్ర ముగుస్తుంది.

ఆ తర్వాత రాష్ట్రాన్ని చుట్టి వచ్చేలా ప్రచార యాత్రలు కొనసాగుతాయి.

**9) సురాజ్యం - మద్యనియంత్రణ ఉద్యమం**

సురాజ్య ఉద్యమంలో భాగంగా కఠిన మద్యనియంత్రణ కోసం వివిధస్థాయిలలో ఉద్యమం ప్రారంభం అవుతుంది.

**మొదటిదశ :** సురాజ్య వలంటీర్ల నమోదు, గ్రామాలలో, పట్టణాలలో మద్యనియంత్రణ కోసం ప్రచారం, ఉద్యమ సన్నాహాలు సాగుతాయి

**రెండోదశ :** మద్యాన్ని ఆదాయమార్గంగా చేసుకున్న ప్రభుత్వ విధానం మారాలని మద్యం షాపుల వేలంపాటలను ఆపాలనే నినాదంతో మే 15-25 తేదీలలో రాష్ట్ర వ్యాపితంగా నిరశన ఉద్యమాలు సాగుతాయి.

**మూడోదశ :** ప్రభుత్వం ఎక్సైజ్ వేలం పాటల్ని నిలిపివేయకపోతే దానికి నిరసనగా వ్యక్తి సత్యాగ్రహం రూపంలో అరెస్టులకు సైతం వెనుకాడకుండా ఈ ఉద్యమం సాగుతుంది. వేలాదిమంది వలంటీర్లు, మహిళలు, ప్రజలు, ప్రముఖులు సారధ్యం వహించే ఉద్యమంగా సాగించబడుతుంది.

**(తరువాయి 18వ పేజీలో)**

# ప్రతిజ్ఞ

## దేశం కోసం.. సురాజ్యం కోసం ...నేను సైతం ...

సురాజ్యం కోసం సాగిస్తున్న మరో స్వతంత్ర పోరాటంలో

నేను భాగస్వామిగా ఉంటాను

స్వతంత్ర యోధుల త్యాగఫలాన్ని,

రాజ్యాంగ విలువలని రక్షించుకోవడం కోసం,

అవినీతిని అంతం చేయడం కోసం నాసర్వ శక్తుల్ని ఒడ్డుతాను

స్వాహారాజ్యాన్ని సురాజ్యం చెయ్యడానికి సాగే సమరంలో

నేను పాలుపంచుకుంటాను

కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా

దేశ ఐక్యతని, సమగ్రతని నిరంతరం కాపాడుతాను

దేశ నిర్మాణ కార్యక్రమంలో నేను విధిగా పాల్గొంటాను

దుర్మార్గానికి బలికానని, దుర్మార్గానికి పాల్పడనని,

అన్నింటినీ మించి దుర్మార్గాన్ని చూస్తూ సహించని నేను శపథం చేస్తున్నాను

ప్రజాస్వామ్యంలో సురాజ్యం నా జన్మహక్కు

దానిని సాధించడం నా విధిగా భావించి ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను

---

( 17వ పేజీ తరువాయి)

**సురాజ్య నిధి :** లోక్‌సత్తా పార్టీ సురాజ్య నిధిని నిర్వహిస్తుంది. దీనికోసం కూపన్‌లను విడుదలచేస్తుంది. సురాజ్య ఉద్యమాన్ని నిరంతరాయంగా కొనసాగించడానికి సురాజ్య నిధికి విరాళాలు ఇవ్వడం, సేకరించడం వలంటీర్ల నిత్యకార్యకలాపాల్లో భాగంగా ఉంటుంది.

ఇవికొన్ని తొలి కార్యకలాపాలు మాత్రమే. సురాజ్య ఉద్యమాన్ని ప్రజల ఉద్యమం చేయాలి. బహుముఖ రూపాల్లో నిరంతరాయంగా సాగించాలి. అందరి తోడ్పాటుతో సాగే ఉద్యమంగా దీన్ని తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. అందుకు అందరి తోడ్పాటును అర్థిస్తున్నాం. ★

# సురాజ్య ఉద్యమం- వలంటీర్ల నమోదు పత్రం

తేదీ : ...................

**సురాజ్య ఉద్యమం ప్రతిజ్ఞ చేసి వలంటీరుగా నమోదు అవుతున్నాను**

**పేరు :** **వయస్సు :** **చదువు :** **వృత్తి :**

**చిరునామా :**

| సెల్‌నెం/ ఫోన్ | జిల్లా / మండలం | పట్టణం/ గ్రామం | వీధి/ డోర్‌నం | పిన్‌కోడ్ |
|---|---|---|---|---|
| | | | | |

**చేపట్టగల నిర్మాణ కార్యక్రమాలు**

1) వ్యక్తిగతంగా నేను చేపట్టగల నిర్మాణ కార్యక్రమాలు : .....................................................................................

.........................................................................................................................................

2) ఒక బృందంలో సభ్యునిగా నేను చేపట్టగల నిర్మాణ కార్యక్రమాలు : ...............................................................

.........................................................................................................................................

3) స్వాహారాజ్యంపై జరిగే ఉద్యమ కార్యకలాపాలలో కార్యకర్తగా లేదా ప్రచారకునిగా పాలు పంచుకుంటాను

**అవును** ☐ **కాదు** ☐

**4) నేను ఇవ్వగల సమయం**

ప్రతిరోజూ.......................................... గంటలు; **(లేదా)** ప్రతి వారంలో ............................. రోజులు

**(లేదా)** ప్రతి నెలలో .......................... రోజులు; **(లేదా)** ప్రతి సంవత్సరంలో........................ రోజులు

**సురాజ్య నిధి**

1) వ్యక్తిగతంగా నేను ఇచ్చే విరాళం ..........................................

2) వ్యక్తిగతంగా నా మిత్రుల నుండి, ఇతరుల నుండి నేను సేకరించి ఇచ్చే విరాళం సుమారుగా .............................

3) విరాళాల సేకరణలో బృంద సభ్యునిగా నేను పాల్గొంటాను **అవును** ☐ **కాదు** ☐

**నమోదు రుసుం 5/- రూపాయలు** (సురాజ్య ఉద్యమం పుస్తకం కోసం)

**నేను స్వయంగా ప్రకటిస్తున్న ఈ కార్యకలాపాలను విధిగా నిర్వహిస్తాను. వలంటీర్ల ప్రాథమిక శిక్షణలో పాల్గొంటాను**

**సురాజ్య ఉద్యమ ప్రతిష్ఠకు భంగం కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉంటాను**

**వలంటీరు సంతకం**

---

## సురాజ్య ఉద్యమ వలంటీర్ల నమోదు - రశీదు

శ్రీ................................................................................ తేదీ : .............

...................................................................................

సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ చేసి వలంటీరుగా నమోదు చేసుకున్నారు.

నమోదు రుసుంగా చెల్లించిన రూ।। 5/- (ఐదు రూపాయలు) ముట్టినవి. నమోదు చేసిన వారి సంతకం

# సురాజ్య ఉద్యమ వలంటీర్లు

# ...కొన్ని నిర్మాణ కార్యక్రమాలు

మన స్వరాజ్యం స్వాహారాజ్యం అయ్యింది. ఈ స్వాహారాజ్యాన్ని అంతం చెయ్యాలి. సురాజ్యాన్ని సాధించాలి. సురాజ్యం ఒక మహత్తరమైన ఉద్యమం. సుపరిపాలన కోసం సాగిస్తున్న మరో స్వతంత్ర్య పోరాటం. స్వరాజ్య ఉద్యమం మనకు స్ఫూర్తిగా ఉంటుంది. ఆ ఉద్యమంలో పరాయిపాలనపై పోరాడుతూనే ప్రజలు నిర్మాణ కార్యక్రమాలలో భాగస్వాములయ్యారు. స్వాహారాజ్యం మీద పోరాడుతూనే మనం కూడా నిర్మాణ కార్యక్రమాలను చురుకుగా సాగించాలి. దేశాన్ని దోచుకునే స్వాహాతంత్రానికి భిన్నంగా దేశంకోసం, మన ఊరికోసం, తోటి మనిషి కోసం మొత్తం మీద సమాజహితం కోసం పాటుపడే వాలంటీర్లు మాత్రమే సురాజ్య ఉద్యమానికి నిజమైన దూతలౌతారు. మరో స్వతంత్ర పోరాటానికి సారధులౌతారు. సురాజ్య ఉద్యమానికి నిజమైన వారసులు అవుతారు. వలంటీర్లుగా నమోదు అయినవారు తమకు ఆసక్తి ఉన్న కార్యక్రమాలను ఎంచుకోండి. ఒక వ్యక్తిగత కార్యక్రమం లేదా ఒక బృంద కార్యక్రమం, సురాజ్య నిధి సేకరణ కార్యక్రమం మాత్రం విధిగా ఉండితీరాలి. అందుకు ప్రతిజ్ఞ చేయాలి. దీక్ష పూనాలి.

1) ఒక గ్రామంలో/ మున్సిపల్‌వార్డులో పదిమంది నిరక్షరాస్యుల్ని గుర్తించి వారికి నాలుగు, అయిదు నెలలపాటు చదవటం, రాయటం నేర్పించటం (లేదా) ఐదుగురు బాలకార్మికులను బడిలో చేర్పించడం లేక చదువు చెప్పడం.

2) ఉపాధ్యాయులు కొరత ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 4,5 నెలల పాటు ప్రతిరోజూ రెండు, మూడు గంటలు పిల్లలకు పాఠాలు చెప్పడానికి స్వచ్ఛంద విద్యా వలంటీరుగా పని చెయ్యడం (లేదా)

3) పాఠశాలల ముగిసిన తరువాత పేద విద్యార్థులు నివసించే ప్రాంతంలో పిల్లలకు చదువు చెప్పడం, చిన్న కథల పుస్తకాలు చదివించడం, దేశభక్తి గీతాలు, ఆటల ద్వారా చదువు, క్విజ్‌లు నిర్వహించడం (లేదా)

4) ఎస్.టి, ఎస్.సి, బి.సి హాస్టలు విద్యార్థులకు కొన్ని నెలలపాటు ప్రతిరోజూ 1,2 గంటలు ట్యూషన్లు చెప్పడం (లేదా)

5) మీరు ఉపాధ్యాయులు, లెక్చరర్‌లు అయితే జాతీయోద్యమ నాయకుల జీవిత చరిత్రలను, ఉద్యమ ఘట్టాలను, విలువలను పిల్లల స్థాయిని బట్టి పరిచయం చెయ్యాలి.

**ఉదా :** ప్రాథమిక పాఠశాలలో జాతీయ నాయకుల బొమ్మల పరిచయం. చిన్న చిన్న నీతి కథలు.

6) మీరు డాక్టరు అయితే ప్రతిరోజూ లేదా వారంలో ఒక రోజు నిర్థిష్టంగా సమయాన్ని ప్రకటించి కొన్ని గంటలపాటు పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం (లేదా)

- సంవత్సరంలో 10 మెడికల్ క్యాంపులలో బృంద సభ్యునిగా పాల్గొనడం, ఈ క్యాంపులకు కొన్ని మందులు సేకరించడం, ఆరోగ్య పరిజ్ఞానాన్ని పేదలకు అందించడం. (లేదా)

- ఒకటి, రెండు పాఠశాలలు లేదా సంక్షేమ హాస్టళ్ళను ఎంచుకుని పిల్లలకు ప్రతి ఆరునెలలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం

7) మీరు న్యాయవాదులైతే ప్రతి వారంలో ఒక రోజు నిర్థిష్టంగా కొన్ని గంటల పాటు పేదలకు ఉచిత న్యాయసలహాలు అందించడం - పౌరహక్కుల మీద ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేపట్టడం. (లేదా)

- సురాజ్య ఉద్యమ సమస్యల మీద న్యాయ సహాయ బృందంలో సభ్యునిగా పనిచేయడం

8) మీకు అనువైన ఒక చిన్న ప్రాంతాన్ని ఎంచుకొని, పదిమొక్కలు నాటి వాటిని సంరక్షించడం (ఒక వీధి, ఒక పాఠశాల, ఒక ఆరోగ్యకేంద్రం, ఒక బస్టాప్, ఒక రిక్షాస్టాండ్)

9) గ్రామంలో/ వార్డుల్లో మూడు, నాలుగు డ్వాక్రా గ్రూపులను ఎంపికచేసుకొని ఆ గ్రూపులకు చదువు అకౌంట్లు, ప్రాజెక్టు నమూనా తదితరాల్లో ఒక సంవత్సరం పాటు వాటికి తోడ్పాటునివ్వడం.

10) గ్రామంలో/ పట్టణంలో ఒక పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల జాబితాలను సర్వే చెయ్యడం. లోపాలను సరిదిద్దడం, సురాజ్య ఉద్యమానికి అవసరమైన సర్వేలకు వలంటీరుగా పాల్గొనడం.

**బృంద కార్యక్రమాలు**

కొందరు వలంటీర్లు కలిసి ఒక బృందంగా ఏర్పడాలి. ఒక బృందం ఈ క్రింది వాటిల్లో ఏదో ఒక కార్యకలాపాన్ని నిర్వహించాలి.

1. **సంస్థలకు తోడ్పాటు :** ఒక పాఠశాల లేదా ఒక సంక్షేమ హాస్టల్ లేదా ఒక ఆరోగ్య కేంద్రం లేదా ఒక అంగన్‌వాడీని లేదా ఒక రేషన్‌షాపులాంటి ప్రభుత్వ సంస్థలను ఎంచుకుని వాటికి ప్రాథమిక అవసరాలు తీర్చడానికి, అవి అందించే సేవలను మెరుగుపరచడానికి నిరంతర కృషి చేయడం.
2. **పౌరసహాయ కేంద్రం :** గ్రామంలో/ పట్టణంలో ఒక పౌరసహాయక కేంద్రాన్ని నిర్వహించడం. ప్రజలు హక్కుగా పొందే పత్రాలను, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలుకు, పంచాయితీ/ మున్సిపాలిటీ సేవలు పౌరులు సకాలంలో పొందడానికి నిరంతర ఒక బృందంగా కృషి చెయ్యడం
3. **యువ వికాస కేంద్రం :**
   - విద్యార్థులను వారి ఆసక్తి మేరకు బృందాలుగా రూపొందించి నిర్మాణ కార్యకలాపాలు నిర్వహింపచేయడం (లేదా)
   - యువతీ యువకులకు వ్యక్తిత్వ వికాస కార్యకలాపాలు నిర్వహించడం (లేదా)
   - సాంస్కృతిక బృందాలను రూపొందించడం, ప్రచారానికి ప్రదర్శించడం (లేదా)
   - నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై సమాచారాన్ని అందించడం (లేదా)
   - గ్రంథాలయాలు, గోడపత్రికలు, కార్టూన్ పోస్టర్ పత్రికలు నిర్వహణ
4. **మహిళా వికాస కేంద్రం :**
   - అంగన్‌వాడీలకు, డ్వాక్రా గ్రూపులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం (లేదా)
   - కళాశాలల్లో ఆడపిల్లలకు కౌన్సిలింగ్, కెరీర్ గైడెన్స్ (లేదా)
   - మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలకు, మహిళా ప్రజాప్రతినిధులకు నాయకత్వం, వ్యక్తిత్వ వికాసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం. న్యాయ సహాయం అందించడం
5. **గ్రామాభివృద్ధి :**
   - బహిరంగ మలవిసర్జన లేని ఒక గ్రామాన్ని / మున్సిపల్ వార్డుని రూపొందించడం (లేదా)

- ప్రతి ఆరు నెలలకు మంచినీటి పరీక్షలు నిర్వహించడం, ఆరోగ్య శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించడం (లేదా)
- ప్రతి ఆరునెలలకు పశువైద్య శిబిరం నిర్వహించడం (లేదా)
- ప్రతి సీజన్‌లో పంటల వారీగా రైతులకు వ్యవసాయ విజ్ఞాన తరగతులు నిర్వహించడం (లేదా)
- రోడ్లు, పారిశుధ్యం, ప్లాస్టిక్స్ నిర్మూలన తదితరాలపై శ్రమదాన కార్యక్రమం (లేదా)
- గ్రామాలలో బెల్టుషాపులు, నాటుసారా, గుడుంబాల అమ్మకాలు లేకుండా చేయడం (లేదా)
- గ్రామంలో/ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సేవలతీరుపై ప్రజాసమీక్షకు **"జనసభ"** కార్యక్రమాలు ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి నిర్వహించడం

**6. ప్రచార బృందం :**

- ప్రతి నెలా ఒక రోజున ఏదో ఒక సెంటర్‌లో సురాజ్య సాహిత్యం అమ్మకానికి ఒక స్టాల్‌ను నిర్వహించడం
- వివిధ తరగతుల వారీగా లేదా ఉమ్మడిగా ప్రతినెలా ఏదో ఒక ప్రచార సభ, సమావేశం నిర్వహించడం
- సురాజ్య ఉద్యమం చేపట్టే కార్యక్రమాలలో వలంటీరుగా పాల్గొనడం

**7. జాతీయ సమైక్యత :**

- జాతీయ సమైక్యతను పెంపొందించటానికి విద్యార్థులకు ప్రత్యేకమైన కార్యకలాపాలు
- జాతీయ పర్వదినాలని, జాతీయ స్ఫూర్తిని పెంపొందించే విధంగా నిర్వహించటం

**8. సురాజ్యనిధి**

- సురాజ్యనిధికి వ్యక్తిగతంగా విరాళం ఇవ్వడం - మిత్రుల నుండి విధిగా విరాళాలు సేకరించి ఇవ్వడం.
- సురాజ్య నిధి సేకరణ/ బృంద సభ్యునిగా పాల్గొనడం

★ ★ ★

# సురాజ్య ఉద్యమం

## కొన్ని నినాదాలు

**సురాజ్య ఉద్యమానికి నగారా మోగిద్దాం... అవినీతి పాలనపై సమరం ప్రకటిద్దాం**

అవినీతి పాలన అంతం - అభివృద్ధి అందరికీ సొంతం

**అవినీతి పాలనకు గోరీ కడదాం - సుపరిపాలనకు పట్టం కడదాం**

ధన రాజకీయం పోవాలి - జన రాజకీయం రావాలి

**స్వాహారాజ్యంపై సమరం సాగిద్దాం - అవినీతి పాలన అంతం చేద్దాం**

కొందరి స్వార్థమే స్వాహారాజ్యం - అందరి సౌభాగ్యమే సురాజ్యం

**ఎదిగే అవకాశాలను తుంచేది స్వాహారాజ్యం**

**వివక్ష లేకుండా అందించేది సురాజ్యం**

జాతిని చీల్చేది కుటిల రాజకీయం - జాతిని కలిపేది కొత్త రాజకీయం

**స్వాహారాజ్యంలో గ్రామాలు కునారిల్లు - సురాజ్యంలో గ్రామ స్వరాజ్యాలు వర్ధిల్లు**

మద్యం జోరు పాలకుల పాపం - ఉద్యమించకపోతే ప్రజలకు శాపం

**బెల్టుషాపులను మూయిద్దాం - మద్యం పీడను వదిలిద్దాం**

మార్పు మన చేతిలో వుంది - మనం వేసే ఓటులో వుంది

**స్వాహారాజ్యాన్ని అంతం చేద్దాం - సురాజ్యాన్ని అందరికీ సొంతం చేద్దాం**

---

**స్వరాజ్యం : నాటి నేతల త్యాగం**

**స్వాహారాజ్య : నేటి పాలకుల స్వార్థం**

**సురాజ్యం : ప్రజల ఉద్యమం**

**సుపరిపాలనే లక్ష్యం**

### నేను.....

**దుర్మార్గానికి బలికాను**

**దుర్మార్గానికి పాల్పడను**

**దుర్మార్గాన్ని చూస్తూ సహించను**